తెప్పపై ఆశీనులై..

ఏడుమార్లు పుష్కరిణి చుట్టిన ఏడుకొండల స్వామి





తిరుమలలో ఐదురోజుల పాటు జరిగిన వార్షిక తెప్పోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏడుకొండల స్వామి పుష్కరిణిలో తెప్పపై ఆశీనులై ఏడుమార్లు విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో అప్పటికే సిద్ధంగా ఉంచిన తెప్పలో కొలువుదీర్చారు. విశేషంగా అలంకరించిన తెప్పపై ఉత్సవమూర్తులను ఏడుమార్లు తిప్పారు. చల్లని వాతావరణంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, అన్నమయ్య కీర్తనల నడుమ తెప్పోత్సవం వైభవంగా జరిగింది. చివరిరోజు కావడంతో పాటు శుక్రవారం పౌర్ణమి గరుడసేవ, రామకృష్ణతీర్థ ముక్కోటి కూడా ఉండటంతో భక్తులు భారీ సంఖ్యలో తెప్పోత్సవంలో పాల్గొన్నారు. దీంతో స్వామి పుష్కరిణి చివరి రోజు భక్తులతో కళకళలాడింది.

ఉత్సవర్లను దర్శించుకున్న జస్టిస్ ఎస్వీఎన్ భట్టి

శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి తెప్పోత్సవాల్లో పాల్గొన్నారు. తెప్పోత్సవాల గురించి అధికారుల ద్వారా తెలుసుకున్న ఆయన కుటుంబ సమేతంగా పుష్కరిణికి చేరుకుని తెప్పపై కొలువుదీరిన ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఆ తర్వాత పుష్కరిణిలో విహరించిన తెప్పను వీక్షించారు. జస్టిస్ ఎస్వీఎన్ భట్టి శుక్రవారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఖాతాదారుల నగలు తనఖా పెట్టిన

బ్యాంకు డిప్యూటీ మేనేజర్ అరెస్టు



వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న సీఐ మురళి

సత్యవేడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నాగలాపురం యూనియన్ బ్యాంకులో ఖాతాదారుల నగలను కాజేసి రూ.2.35 కోట్లకు తనఖా పెట్టిన డిప్యూటీ మేనేజర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం సత్యవేడులో సీఐ మురళి మీడియాకు వివరించారు. 'నాగలాపురంలోని యూనియన్ బ్యాంకులో 2024 మే నుంచి 2025 ఫిబ్రవరి 10వ తేదీ వరకు బంగారు నగలపై రుణాలు పొందిన 67 మంది ఖాతాదారులకు సంబంధించిన రెండున్నర కిలోల నగలను డిప్యూటీ మేనేజర్ ఆరవ సూర్యతేజ్ లాకర్ల నుంచి ఎత్తుకెళ్లాడు.ఇందులో 30మంది ఖాతాదారుల నగలను కుదువ అంగళ్లు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో తనఖా పెట్టి రూ.1.04 కోట్లు తీసుకున్నాడు. మరో 37మంది ఖాతాదారుల నగలను అదే బ్యాంకు(నాగలాపురం యూనియన్ బ్యాంకు)లోనే 11 మంది బినామీ పేర్లపై రొటేషన్ పద్ధతిలో మార్చుకుంటూ కుదువ పెట్టి రూ.1.31 కోట్లు తీసుకున్నాడు. ఇలా కాజేసిన నగలను తనఖా పెట్ట రూ.2.35 కోట్లు కాజేశాడు. ఇటీవల బ్యాంకులో జరిగిన ఆడిట్‌లో ఈ ఘరానా మోసం వెలుగు చూసింది. విచారణ జరిపిన అధికారుల బృందం ఖాతాదారులు తమ అవసరాల నిమిత్తం బ్యాంకులో తనఖా పెట్టిన నగలను బ్యాంకు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ దొంగతనం చేసినట్లు నిర్ధారించారు. యూనియన్ బ్యాంకు తిరుపతి రీజియన్ డీజీఎం బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌తో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న బ్యాంకు మేనేజరు తిరైవరాజ్‌పై నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో గత నెల 20న కేసు నమోదైంది' అని సీఐ వివరించారు. సత్యవేడు సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌ను నాగలాపురం హైవే సమీపంలోని ఆర్చి వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. బ్యాంకు మేనేజర్ తిరైవరాజ్ పరారీలో ఉన్నారు. ఇతడి కోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు. సమావేశంలో నాగలాపురం ఎస్ఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, బ్యాంకులో ఘరానా మోసానికి పాల్పడిన సూర్యతేజ్ ఆ డబ్బులను ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్నట్లు తెలిసింది. ఆయన నుంచి నగలను తాకట్టు పెట్టిన పలు రసీదులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న హరియాణా మద్యంతో ఎక్సైజ్ అధికారులు

హరియాణా టూ తిరుపతి

- వయా ఢిల్లీ -

- ఎన్నో ఏళ్లుగా మద్యం అక్రమ రవాణా.. విక్రయాలు
- రూ.1.28 లక్షల మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు
- మూలాలపై ఆరా తీస్తున్న ఎక్సైజ్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 13(ఆంధ్రజ్యోతి): హరియాణా నుంచి ఢిల్లీ మీదుగా గూడూరు, తిరుపతికి తీసుకొచ్చి కొన్నేళ్లుగా సాగిస్తున్న అమ్మకాల గుట్టు రట్టయింది. ఈ కేసులో హరియాణాకు చెందిన.. ప్రస్తుతం తిరుపతిలో ఉంటున్న ప్రధాన సూత్రధారి గజేంద్ర శర్మను, దీనికి ఆర్థిక సహకారం అందిస్తున్న సి.బాబును ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.28 లక్షల విలువ చేసే 109 హరియాణా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు విజయశేఖర్ గురువారం తిరుపతిలో మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. హరియాణాకు చెందిన గజేంద్రశర్మ తిరుపతి స్కావెంజర్స్ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఆయుర్వేద మందులు అమ్ముతున్నాడు. ఈ క్రమంలో హరియాణా నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తీసుకొచ్చి అమ్మడంపై దృష్టి పెట్టాడు. ఎందుకంటే.. ఇక్కడికి, అక్కడికి బాటిల్‌పై దాదాపు రూ.700 వ్యత్యాసం ఉంది. దీంతో తొలి రోజుల్లో ప్రతి నెలా హరియాణా నుంచి మద్యం సీసాలను ట్రావెల్స్ బ్యాగులో పెట్టుకుని ఢిల్లీకి.. అక్కడ్నుంచి రైళ్లలో గూడూరుకు చేర్చేవాడు. అక్కడ ట్రావెల్స్, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లతో పరిచయాలు పెంచుకుని వారి ద్వారా విక్రయించేవాడు. ఈ ఆదాయం రూ.లక్షల్లో ఉండటంతో కొంత మంది మధ్యవర్తులను నియమించుకుని వ్యాపారాన్ని విస్తరించాడు. అదే సమయంలో తిరుపతి నగరం తాతయ్యగుంటలో కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తున్న సి.బాబుతో పరిచయం పెంచుకుని.. హరియాణా మద్యం అక్రమ విక్రయాలను తిరుపతిలోనూ మొదలు పెట్టాడు. ఇందులో మంచి లాభాలు రావడంతో బాబు కూడా అవసరమైన పెట్టుబడి పెట్టాడు. తన దుకాణంలో సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయాలు చేస్తూ వచ్చాడు.

గుట్టు రట్టయిందిలా..

హరియాణా నుంచి తెచ్చిన మద్యాన్ని నాయుడుపేటలో విక్రించడానికి ఓ మద్యం దుకాణం వద్దకు గజేంద్రశర్మ వెళ్లాడు. తన వద్ద హరియాణాకు చెందిన మిలటరీ మద్యం ఉందని కొనుగోలు చేస్తామంటే తీసుకొస్తానని దుకాణ సూపర్‌వైజర్‌తో చెప్పాడు. దీనిపై అనుమానం వచ్చిన అతడు.. నాయుడుపేట ఎక్సైజ్ సీఐ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే జిల్లా ఎక్సైజ్ అధికారులు వాసుదేవ చౌదరి, నరసనాయుడు, శ్యామ్‌కుమార్, టాస్క్ ఫోర్సు ఎస్ఐ స్వామినాథన్, అర్బన్ సీఐ రామచంద్ర, అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగారు. తమకు హరియాణా మద్యం కావాలంటూ ఫోనులో గజేంద్రశర్మతో మాట్లాడారు. దీంతో గురువారం అతడు వివిధ బ్రాండ్లకు సంబంధించి 109 బాటిళ్ల హరియాణా మద్యం తీసుకురాగా అదుపులోకి తీసుకుని విచారించారు. తిరుపతికి చెందిన కూల్‌డ్రింక్ దుకాణం యజమాని బాబునూ అరెస్టు చేశారు. వారి నుంచి 12 ఖాళీ బాటిళ్లతో పాటు దాదాపు రూ.1,28,600 విలువ చేసే మద్యం సీజ్ చేశారు. ఈ కేసులో పాత్రధారి తిరుపతికి చెందిన కారు డ్రైవర్ చల్లా శ్రీనివాస రెడ్డి కోసం గాలిస్తున్నారు.

ఒంటరి వృద్ధభక్తులే టార్గెట్

- మత్తు మందిచ్చి దోచుకుంటున్న ఇద్దరి అరెస్ట్

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వచ్చే వృద్ధ భక్తులను టార్గెట్ చేస్తూ.. మత్తు ముందు ఇచ్చి దోచుకుంటున్న ఇద్దరిని తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. వివరాల మేరకు.. ఈ ఏడాది జనవరి 5వ తేదీన ఓ భక్తురాలు తన సొత్తును ఎవరు దోచుకెళ్లారంటూ తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. శ్రీవారి ఆలయ తూర్పుమాడవీధిలోని గ్యాలరీ కూర్చుని ఉన్న తనకు దర్శనం చేయిస్తామని నమ్మించి మత్తు మాత్రలు ఇచ్చి తాళిబొట్టు చైన్, చెవి దిద్దులు తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ మొదలుపెట్టారు. కొందరు అనుమానితుల వీడియోలు, ఫొటోలతో తమిళనాడులోని ప్రధాన నగరాల్లో గాలించారు. పోలీస్ స్టేషన్లు, క్రైం బ్యూరోలను సందర్శించి ఫొటోలు, వీడియోలతో ఆరా తీయగా, భక్తురాలిని దోచుకున్నవారు తమిళనాడులోని విల్లుపురానికి చెందిన విజయ్‌కుమార్, అతడి పిన్ని శారదగా తేలింది. ఆలయాలకు వెళ్లే ఒంటరి వృద్ధ భక్తులను టార్గెట్ చేసుకుని వారికి మాయ మాటలు చెప్పి దగ్గరై ఆ తర్వాత ఆహారంలో నిద్ర మాత్రలు ఇస్తారు. భక్తులు మత్తులోకి వెళ్లిన తర్వాత వారి శరీరంపై ఉండే బంగారు వస్తువులను దోచుకెళుతున్నట్టు తేలింది.వీరిపై ఇప్పటికే తమిళనాడులో చాలా కేసులు ఉండటంతో పాటు జైలు శిక్షలూ అనుభవించినట్టు తిరుమల పోలీసుల విచారణలో తేలింది. ఎప్పటికప్పుడు పేర్లు, చిరునామాలు, ఫోన్ నెంబర్లు మారుస్తూ ఇతర నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. తమిళనాడులోని మూడుజిల్లాల పోలీసులు వీరికోసం గాలిస్తున్న క్రమంలో ప్రత్యేక నిఘాతో తిరుమల పోలీసులు కాంచీపురంలో విజయకుమార్, శారదను గురువారం పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి 21 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, 6 మత్తు మాత్రలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : 6.26
సహరి (శనివారం) : 5.02

'మామండూరు'ను సుందరంగా తీర్చిదిద్దుతాం



మాముండూరు అటవీ ప్రాంతంను సందర్శిస్తున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మామండూరు పర్యాటక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దతామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. పేర్కొన్నారు. మామండూరు అటవీ ప్రాంతంలోని పలు ప్రదేశాలను గురువారం ఆయన సందర్శించారు. శేషాచలం బయోస్పియర్ రిజర్వులోని శ్యామల వ్యాలీలోని మామండూరు కమ్యూనిటీ బేసిడ్ టూరిజంను ఏర్పాటు చేశారన్నారు. వందేళ్ల కిందటే అటవీ శాఖ భవనాలు ఉన్నాయని, ఈ అడవులలో 80కి పైగా చిరుతపులులు, ఏనుగులు, అరుదైన 40 పక్షి జాతులు ఉన్నాయన్నారు. నెలకు ఆరేడు వేల మంది ఈ పర్యాటక ప్రాంతాన్ని సందర్శిస్తున్నట్లు తెలిపారు. వీరికోసం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అటవీ శాఖ అధికారులు సఫారీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించేలా సఫారీ, వాచ్ టవర్, సరస్సులు చాలా అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రేణిగుంట తహసీల్దారు సురేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాస రావు, ఎంపిడివో విష్ణు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'విరించి'



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన విరించి-2కె25 కార్యక్రమం గురువారం ముగిసింది. రెండు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 912 మంది విద్యార్థులు రికార్డు స్థాయిలో పాల్గొన్నారు. క్లూ ఛేజర్స్‌లో 509 మంది, మిస్ విరించిలో 40 మంది, ప్రావర్బ్స్, రిడిల్స్‌లో 115 మంది, నాట్యంలో 65 మందితో పాటు ఇతర పోటీల్లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

మహిళలకు సన్మానం


పద్మజారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో గురువారం ఎంఈవో బాబ్జీ అధ్యక్షతన మహిళా దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. సమాజంలో స్త్రీల పాత్రపై ప్రసంగించారు. పద్మజారెడ్డి, ఈవోపీఆర్డీ శశిరేఖ, ఉపాధ్యాయినులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

నెత్తకుప్పంలో ఉపాధి హామీ పనుల తనిఖీ


ప్రహరీ గోడ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

రామచంద్రాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే నిర్మాణాల్లోనాణ్యత ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ సూచించారు. నెత్తకుప్పంలో రూ.3కోట్లతో నిర్మిస్తున్న సీసీరోడ్లు, పాఠశాల ప్రహరీగోడతో పాటు ఫారం పాండ్స్‌ను గురువారం ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లు తనిఖీ చేశారు. పాఠశాల ప్రహరీగోడ నాణ్యతను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారునికి సూచించారు. కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో హంసవేణిని ఆదేశించారు. సాంకేతిక సహాయకులు సుదర్శన్, క్షేత్ర సహాయకులు పురుషోత్తం, వెంకట్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


బీజేపీలో చేరిన నాయకులు

చంద్రగిరి మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ముఖ్య నేతల ఆధ్వర్యంలో శానంభట్ల చెందిన మురళిరెడ్డి, నరసింగాపురానికి చెందిన డీవీ రమణ, బందార్లపల్లెకు చెందిన రూపేష్ కుమార్‌లు అనుచరులతో గురువారం బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ చంద్రగిరిలో బీజేపీ బలోపేతానికి సమిష్టిగా పని చేయాలన్నారు. యువ నాయకులు పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో ప్రతి గడపకు చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మునిగంగిరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, వెంకటముని, పురుషోత్తం రెడ్డి, దొరస్వామి, దీనదయాల్‌నాయుడు, నవీన్‌కుమార్ రెడ్డి, రూపేష్ కుమార్, ఇందుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోలీని సురక్షితంగా, బాధ్యతతో జరుపుకుందాం

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను సురక్షితంగా, బాధ్యతతో జరుపుకోవాలని తిరుమల పోలీసులు స్థానికులకు సూచించారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోలీ జరుపుకోవాలన్నారు. ఇతరులపై బలవంతంగా రంగులు వేయకూడదన్నారు. పరస్పర గౌరవంతో పండగను జరుపుకోవాలని హితవుపలికారు. తమ అనుమతి లేకుండా బలవంతంగా రంగులు పూయడం, వేధింపులకు గురిచేయడం లాంటివి చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని గురువారం ఓ ప్రకటనలో పోలీసులు స్పష్టం చేశారు.

నిత్యం ఈ మార్గంలో ప్రమాదాలు


టవర్ క్లాక్ సమీపాన ప్రమాదకరంగా కాలువపై రాడ్లు

చంద్రగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళే దారిలో నిత్యం వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. వాహనాలు అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. ఈమార్గంలో మురుగు కాలువ ఉంది. పంచాయతీ అధికారులు శుభ్రం చేయడానికి కాలువపై ఇనుప రాడ్డులతో జల్లెడ మాదిరిగా ఏర్పాటు చేశారు. ఈమార్గంలోనే ప్రభుత్వ ఆసుపత్రి, కోదండరామాలయం, విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం, విద్యుత్ సబ్ స్టేషన్‌లకు వెళ్ళాల్సి ఉంది. కాలువ వెడల్పుగా ఉండటం, ఇనుప రాడ్లు వంగిపోవడంతో కాలువపై ప్రమాదాలు జరుగుతున్నాయి. 108 వాహనం ఈకాలువ దాటుకునే క్రమంలో తరచూ వాహనం అదరండంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. కార్లు లాంటి వాహనాల చక్రాలు కాలువలో దిగడంతో టైర్లు పంక్చర్ అవుతున్నాయి. దీనిపై గతంలోనే పంచాయతీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇకనైనా స్పందించి కాలువపై ఇనుప రాడ్లను తొలగించి, మోల్డింగ్ పోస్తే ప్రమదాలు తగ్గుతాయని స్థానికులు చెబుతున్నారు.

తిరుమలలో నేడు పౌర్ణమి గరుడసేవ

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య సర్వాంకార భూషితుడైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

● శుక్రవారం తిరుమలలో రామకృష్ణతీర్థ ముక్కోటి కూడా జరుగనుంది. భక్తులను ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తీర్థానికి అనుమతించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. తాగునీరు, అన్నప్రసాదాలు అందజేయనున్నారు.

చలో పిఠాపురం పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి రూరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్, రూరల్ మండల ఇన్‌చార్జి పగడాల యువిరాయల్ పిలుపునిచ్చారు. దుర్గసముద్రంలో గురువారం హలోచంద్రగిరి- ఛలో పిఠాపురం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జనసైనికులతో కలసి ఛలో పిఠాపురం పోస్టర్లని ఆవిష్కరించారు. నాయకులు వెంకట్, శ్రీనురాయల్, శేఖర్‌రాయల్, జ్ఞాన సాయి, సునీల్ రాయల్, హరీష్, మురళి, ప్రేమ్‌కుమార్, ఆశా, రంజిత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పాలిసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(గాంధీరోడ్డు), మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఏపీపాలిసెట్-2025కి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్వీ రమణకుమార్ గురువారం తెలిపారు. టెన్త్ పాసైన.. ఈ ఏడాదిలో పరీక్షలు రాయబోవు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 'ఏపీపాలిసెట్.ఏపీ.ఎన్ఐసీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేయాలని కోరారు. ఎస్సీఎస్టీ విద్యార్థులు రూ.100, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.400ఫీజు చెల్లించాలని తెలిపారు. సమీప ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో సంప్రదించి దరఖాస్తు చేయవచ్చని, అలాగే తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. వివరాలకోసం హెల్ప్‌లైన్ ఇన్‌చార్జి కమల్‌ను 99851 29995లో సంప్రదించాలని సూచించారు. కాగా ఏప్రిల్ 30న తిరుపతి, సత్యవేడు, గూడూరులోని కేంద్రాల్లో పాలిసెట్ నిర్వహిస్తామని వివరించారు. అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో వచ్చే నెల ఒకటి నుంచి పాలిసెట్ ప్రవేశపరీక్షకు ఉచిత శిక్షణతోపాటు స్టడీమెటీరియల్ అందిస్తామన్నారు.

రాపిడో ఈ-బైక్స్ పంపిణీ


ఎలక్ట్రిక్ బైక్స్ పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర

తిరుపతి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 25 మంది నగర మహిళలకు రాపిడో ఈ-బైక్స్‌ను మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి యూబీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు ద్వారా రుణాల రూపంలో బైకులను అందజేశామన్నారు. మెప్మా నుంచి నెలకు ఈఎంఐకి రూ.500 జమ చేస్తామన్నారు.

మొల్లకు ఘన నివాళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రచయిత్రి మొల్లకు పలువురు నివాళి అర్పించారు. మొల్ల కళాపీఠం ఆధ్వర్యంలో మహతి సమీపంలో గల మొల్ల విగ్రహానికి గురువారం పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. మొల్ల కళా పీఠం అధ్యక్షుడు కేశవులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సాకం నాగరాజ, గుండాల గోపీనాథరెడ్డి, అవధాని ఆముదాల మురళి నివాళి అర్పించారు.

ట్రాక్టరు బోల్తా ముగ్గురికి స్వల్పగాయాలు



పాకాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె - కృష్ణాపురం రోడ్డు నన్నూరివారిపల్లె సమీపంలోని కర్నం చెరువు కట్టపై ట్రాక్టరు బోల్తా పడింది. గురువారం ఉదయం నన్నూరివారిపల్లె వైపు ట్రాక్టర్ వెళ్తుండగా ఎదురుగా కారు వేగంగా రావడంతో ఇరుకు రోడ్డులో ట్రాక్టరు సైడ్ ఇవ్వబోయి అదుపు తప్పింది. ట్రాలీతో సహా కట్టకింద పడిపోయింది. అందులో ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. చెరువు కట్టపై రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మవారి సేవలో మణిపూర్ హైకోర్టు చీఫ్ జస్టిస్


ఆలయం వద్ద జస్టిస్ టి.కృష్ణకుమర్

తిరుచానూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని గురువారం మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.కృష్ణకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట జస్టిస్ టి.కృష్ణకుమార్ ధ్వజస్తంభానికి నమస్కరించి తరువాత సన్నిధిలోని అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, ఏవీఐ బ్రహ్మానంద రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న మహిళ గుర్తింపు


కామసాని కమలమ్మ(పాతచిత్రం)

రామచంద్రాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):రాయలచెరువకట్టపై ఆత్మహత్య చేసుకున్న మహిళను పోలీసులు గురువారం గుర్తించారు. పత్రికల్లో వార్త రావడంతో మృతురాలి కుటుంబ సభ్యులు గుర్తించి ఆర్‌సీపురం పోలీసులను సంప్రదించారు. మృతురాలు చంద్రగిరి మండలం మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన కామసాని కమలమ్మ(60)గా గుర్తించినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

టీటీడీ సీవీఎస్వోగా ఎస్పీ బాధ్యతల స్వీకారం


హర్షవర్ధన్‌రాజుకు లడ్డూప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

తిరుమల, మార్చి13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ సీవీఎస్వోగా గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో గురువారం ఆలయంలో బాధ్యతలు చేపట్టి శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా, డిప్యూటీఈవో లోకనాథం లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఇంటర్ మోడల్ బస్ స్టేషన్ స్థితి ఏంటి?

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంటర్ మోడల్ బస్టేషన్ నిర్మాణం ప్రతిపాదనలు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నాయంటూ పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి వివరణ ఇచ్చారు. బేస్ మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, ప్రాజెక్టు నమూనాను సంబంధిత వర్గాల సూచనలతో మెరుగుపరిచే పనులు జరుగుతున్నాయని తెలిపారు. డిజైన్ సిద్ధమైన వెంటనే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో కలసి ప్రాజెక్టు అమలు చేయనుందని వివరించారు.

గురు దక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురు దక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కతృవులు నిర్వహించారు. స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు.

ఆక్రమణదారులకు సోలార్ విద్యుత్ కనెక్షన్లా!


ఇంటి మీద సోలార్ పలకల ఏర్పాటు



ఇళ్లకు సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు

చంద్రగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆక్రమిత ప్రభుత్వ భూమిలో ఉచిత సోలార్ పథకం కింద లబ్ధి చేకూర్చడం విమర్శలకు దారితీస్తోంది. వివరాలిలి. ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలో నాగపట్ల రెవెన్యూ లెక్కదాఖల్లో సర్వే నెంబర్ 80-ఏలో 8.31 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో ఇందులో మామిడి తోట ఉండేది. ఏటా పంటను రెవెన్యూ అధికారులు వేలం వేసేవారు. కాలక్రమేణా ఈ భూమి కబ్జాకు గురవుతూ వచ్చింది. అప్పట్లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు కూడా పెట్టారు. అయినా ఆ భూమిలో 11 అక్రమ నిర్మాణాలు వెలిశాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల అండతో పంచాయతీ కార్యదర్శి సిఫార్సుతో ఆక్రమణదారులు విద్యుత్ మీటర్లు పొందగలిగారు. విద్యుత్ మీటర్ల ఇవ్వరాదంటూ పంచాయతీ కార్యదర్శికి, విద్యుత్ అధికారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినా బేఖాతరు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమ నిర్మాణదారులపూ అధికారులు పాతప్రేమనే చూపిస్తున్నారు.

ఏడుగురికి కనెక్షన్లు

పైలెట్ ప్రాజెక్టు కింద స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్‌లో ఎ.రంగంపేట పంచాయతీ ఉండటాన్ని ఆక్రమణదారులు అనువుగా మార్చుకున్నారు. పలుకుబడిని ఉపయోగించి ఇప్పటికే ఏడుగురు అక్రమంగా నిర్మించిన షెడ్లకు లక్షలాది రూపాయల విలువ గల ఉచిత సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయించుకున్నారు, వీరికి పథకాల లబ్ధి చేకూర్చడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

తిరుమలేశుని సేవలో 'దిల్‌రూబా' చిత్ర బృందం



తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): 'దిల్‌రూబా' చిత్ర బృందం గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు విశ్వ కరుణ్, హీరోయిన్లు నజియా డేవిసన్, రుక్సర్ థిల్లాన్, చిత్ర బృందం సభ్యులు వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం హీరో కిరణ్ అబ్బవరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. దిల్‌రూబా చిత్రం శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో స్వామి ఆశీస్సుల కోసం వచ్చామన్నారు. తన ప్రతి సినిమా విడుదలకు ముందు తిరుమలకు రావడం అలవాటయిందన్నారు. దర్శకుడు విశ్వకరుణ్ మాట్లాడుతూ.. తమ సినిమాను అభిమానులందరూ ఆదరించాలని కోరుకుంటున్నారు. తెలుగులో తాను తీసిన మొదటి సినిమా దిల్‌రూబా అన్నారు.


అవగాహన లోపంతో హక్కులు కోల్పోతున్నారు



మాట్లాడుతున్న జస్టిస్ డాక్టర్ ఎస్‌వీఎన్ భట్టి

తిరుపతి(వైద్యం), మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించినా వాటిపై అవగాహన లోపం వల్ల అనుభవించలేకపోతున్నారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ఎస్‌వీఎన్ భట్టి పేర్కొన్నారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో చట్టం, మహిళా సాధికారిత అనే అంశంపై గురువారం నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానులనే విషయాన్ని దృఢంగా విశ్వసించాలన్నారు. అప్పుడే వారి హక్కులను స్వతంత్రంగా పొందగలరని తెలిపారు. మహిళా సాధికారిత, లింగ సమానత్వం గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఆర్వీకుమార్, ఎంఎస్ రామ్, డీన్ అల్లాడి మోహన్, ప్రిన్సిపాళ్లు ఉషా కళావత్, మాధవి, సుధారాణి పాల్గొన్నారు.

ధార్మిక విషయాల్లో రాజకీయ జోక్యం అవసరం లేదు


విష్ణువర్ధన్‌రెడ్డి

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): ధార్మిక విషయాల్లో రాజకీయ జోక్యం అవసరం లేదని బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కాశీనాయన ఆశ్రమానికి చెందిన నిర్మాణాలను కొందరు అధికారులు అత్యుత్సాహంతో కూల్చివేయడం బాధాకరమన్నారు. కూల్చిన భవనాన్ని సొంత నిధులతో వీలైనంత త్వరగా నిర్మిస్తామని మంత్రి లోకేశ్ ప్రకటన చేయడం మంచి నిర్ణయమన్నారు. ధార్మిక అంశాల్లో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. శ్రీవారిని, హిందూ ధర్మాన్ని విశ్వసించే వారే శ్రీవారి సేవలో పనిచేసేలా టీటీడీ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. అన్యమతానికి సంబంధించిన ఉద్యోగుల విషయంలో వేగవంతమైన చర్యలు తీసుకుని టీటీడీతో సంబంధం లేకుండా వారిని ఇతర శాఖలకు పంపాలన్నారు. రాష్ట్రంలోని ఇతర దేవాలయాల్లోనూ అన్యమత ఉద్యోగులు ఉన్నారనే ఫిర్యాదులు ఉన్నాయని, వారిపైనా దేవదాయశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.45 లక్షల ఎర్రచందనం స్వాధీనం

తిరుపతి (మంగళం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పుత్తూరు అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన రూ.45 లక్షల విలువైన 112 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో గురువారం నిందితుల అరెస్ట్ చూపారు. టాస్క్‌ఫోర్స్ సీఐలు సాయి గిరిధర్, లింగాధర్ చెప్పిన వివరాల మేరకు.. పుత్తూరు నుంచి నారాయణవనం వరకు ఉన్న అటవీ ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. తిరుమల కుప్పం మెయిన్ రోడ్డులోని రామసముద్రం గ్రామం వద్ద దాచి ఉంచిన 112 ఎర్రచందనం దుంగలు గుర్తించారు. వాటి విలువ రూ.45 లక్షలు ఉంటుందని తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వడమాలపేట, నారాయణవనం ఫారెస్ట్ బీట్ అధికారులు, రఫీ, కుమారస్వామి, నూర్‌అబ్జలాల్ పాల్గొన్నారు.

దళిత మహిళలకు వంట సామగ్రి పంపిణీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ ఏ ఆర్ ఎ స్) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 25 మంది దళిత మహిళలకు చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తులు తయారు చేసేందుకు అవసరమైన వంట సామగ్రి, పరికరాలను ఆర్ఏఆర్ఎస్ ఏడీ డాక్టర్ సుమతి అందజేశారు. గురువారం ఆర్ఏఆర్ఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాస్త్రవేత్త కరీముల్లా మాట్లాడుతూ చిరుధాన్యాలతో మనిషి ఆరోగ్యానికి చాలా ప్రయోజనం కలుగుతుందన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయన్నారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేసే విషయంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రాగి మాల్ట్, జొన్న, రాగి బిస్కెట్లు, లడ్డు, మురకలు, పబ్బిళ్లలు పంపిణీ చేశారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల వైసీపీ అధ్యక్షుడిగా రామిరెడ్డి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డిని నియమించినట్లు ఆపార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సిఫార్సు మేరకు ఈనియామకం జరిగింది. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈపదవి ఇచ్చినందుకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పేరూరులో ఆక్రమణల తొలగింపు



తిరుపతిరూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): పేరూరులో సర్వేనంబర్లు 460/2, 488లోని కాలువ పోరంబోకులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో తొలగించారు. ఆక్రమణదారులు చేపట్టిన 11 నిర్మాణాలను జేసీబీ సాయంతో తొలగించామని రూరల్ తహసీల్దార్ రామాంజులు నాయక్ పేర్కొన్నారు.

మజ్జిగ వారోత్సవాలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వినాయకసాగర్‌లో గురువారం నుంచి మజ్జిగ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వాకర్స్ దాహం తీర్చడానికి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. మరిన్ని కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం రాజు, చంద్ర, సాయిబాబారెడ్డి, సుజాత, విజయలక్ష్మి, దేవేంద్ర, నాగముని పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిరిపురం యానాది కాలనీవాసులకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం ఈ కాలనీలో పర్యటించారు. ప్రజలు తమ సమస్యలను వారికి వివరించగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేణు, ఎం.జయంతి, చంద్రశేఖర్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

17న జీవ వైవిధ్య సదస్సు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఈనెల 17వ తేదీన జీవవైవిధ్య సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అక్షర ఫౌండేషన్ ప్రతినిధి హరిబాబు, వర్సిటీ ఎన్ఎస్ఎస్, కల్చరల్ కో-ఆర్డినేటర్లు పాకనాటి హరికృష్ణ, పత్తిపాటి వివేక్ తదితరులు ఆవిష్కరించారు. ఏపీ జీవవైవిధ్య సంస్థ చైర్మన్ నీలాయపాళెం విజయకుమార్ పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

రాజధానికి తరలిన టీటీడీ ఉన్నతాధికారులు

● అమరావతిలో రేపు శ్రీనివాస కల్యాణోత్సవం

తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉన్నత స్థాయి యంత్రాంగం యావత్తూ రాష్ట్ర రాజధానికి తరలిపోయింది. అమరావతిలో శనివారం శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో.. ఏర్పాట్ల పర్యవేక్షణకు ఉన్నతాధికారులంతా వారం రోజులుగా రాకపోకలు సాగిస్తున్నారు. బుధవారం కీలక అధికారులంతా రాజధానికి వెళ్లడంతో తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం బోసిపోయినట్టయింది. అమరావతిలోని వేంకటపాలెంలో టీటీడీ శ్రీవారి ఆలయం నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ ఆలయ ప్రాంగణంలో శనివారం తొలిసారిగా శ్రీనివాస కల్యాణోత్సవం జరపాలని తలపెట్టింది. 27 వేల మంది ఆశీనులై.. కల్యాణోత్సవం వీక్షించేలా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు, భజన బృందాలకు సదుపాయాలను కల్పించడంలో టీటీడీ తలమునకలవుతోంది. ఈనెల 7న టీటీడీ ఈవో శ్యామలరావు వేంకటపాలెంలో గుంటూరు కలెక్టర్, ఎస్పీలతో కలసి గోడ పత్రిక ఆవిష్కరించారు. రాజధాని పరిసర ప్రాంతాల్లో ప్రచార రథాలను ప్రారంభించారు.

వారం రోజులుగా పర్యవేక్షణ

వారం రోజులుగా టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు సహా ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు అక్కడికి రాకపోకలు సాగిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇక, బుధవారం ఈవో, అదనపు ఈవో, జేఈవో, చీఫ్ ఇంజనీర్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ, ఎలక్ట్రికల్ విభాగం ఎస్ఈ, తిరుపతి ఎస్టేట్ అధికారి, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ జీఎం, ఫారెస్ట్ కన్జర్వేటర్ తదితర కీలక అధికారులు అమరావతి వెళ్లారు. మరోవైపు పాలక మండలి చైర్మన్‌తో పాటు సభ్యులు పనబాక లక్ష్మి, శాంతారాం, జ్యోతుల నెహ్రూ తదితరులు అక్కడే వుండి ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. ఇలా.. కీలక యంత్రాంగమంతా రాజధానిలో ఉండటంతో తిరుపతిలోని టీటీడీ పాలనా భవనం బోసిపోయింది. అమరావతిలో శ్రీనివాస కళ్యాణోత్సవం ముగిశాక 16వ తేదీన టీటీడీ ఉన్నతాధికారులంతా తిరిగి తిరుపతి చేరుకోనున్నారు.

స్వచ్ఛ తిరుపతి లక్ష్యంగా పనిచేద్దాం!

డిప్యూటీ మేయర్లతో పట్టాభి



పట్టాభికి శ్రీవారి చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు

తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నిత్యం లక్ష మంది యాత్రికులు వచ్చే తిరుపతిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్వచ్ఛ నగరమే లక్ష్యంగా కలిసి పనిచేద్దామని స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఇటీవల తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణ కార్పొరేటర్లతో కలసి గురువారం విజయవాడలో పట్టాభిని మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీవారి చిత్రపటాన్ని అందించారు. ఆర్సీని పట్టాభి అభినందించారు. తిరుపతిలో జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే తానూ పాల్గొంటానని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, 35వ డివిజన్ అధ్యక్షుడు ఎస్వీఎం శ్రీధర్, నాయకులు జగ్గ, మణి నాయుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాను నిర్లక్ష్యం చేస్తే అంధత్వం



గ్లకోమాపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గ్లకోమాను మొదట్లోనే గుర్తించి సకాలంలో వైద్యం పొందాలని, లేకపోతే శాశ్వత అంధత్వానికి దారి తీస్తుందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ పేర్కొన్నారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక జూపార్కు రోడ్డులోని అరవింద్ కంటి ఆస్పత్రిలో గ్లకోమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్లకోమా అనేది కంటి లోపల అధిక ఒత్తిడి వల్ల వచ్చే వ్యాధి అని, దీని లక్షణాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు.అరవింద్‌ఆస్పత్రి వైద్యాధికారులు పెరుమాళ్ స్వామి, మధుబాబు, అశోక్ వర్ధన్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిన జన సైనికులు



గరుడ వలయం వద్ద జన సైనికులు

తిరుపతి అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభకు తిరుపతి నియోజకవర్గం నుంచి జన సైనికులు భారీగా తరలివెళ్లారు. పార్టీ నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం అలిపిరి గరుడ వలయం వద్ద జన సైనికులు, పవన్‌కల్యాణ్ అభిమానులు, వీర మహిళలు కొబ్బరికాయలు సమర్పించి 50 వాహనాల్లో బయల్దేరారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

తిరుపతి, మార్చి13(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆయనను రేణిగుంట ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన ఆయనను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంటు రైటర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తిరుపతి

హద్దులు మీరితే అనర్థాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ సందర్భంగా హద్దులు మీరి ప్రవర్తించి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని ఎస్పీ హర్షవర్ధనరాజు సూచించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ పండుగ ముసుగులో నిబంధనలు అతిక్రమించరాదన్నారు. ద్విచక్ర వాహనాల డ్రైవింగ్‌లో నిబంధనలు పాటించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటోడ్రైవర్, టీచర్ ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల పరిధిలో గురువారం ఆటోడ్రైవర్, టీచర్ ఘర్షణపడ్డారు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. చిగురువాడకు చెందిన ఆటోడ్రైవర్ చిరంజీవి తన పిల్లలను తీసుకుని వెళుతున్నాడు. మార్గమధ్యంలో ప్రైవేటు స్కూల్ టీచర్ అక్షయభూషణ్ ఆటోకు తగిలి కిందపడ్డాడు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన టీచర్ ఆటోడ్రైవర్‌ను బెల్టుతో కొట్టాడు. విషయం ఆటోడ్రైవర్ బంధువులకు తెలియడంతో స్కూల్లోకి చొరబడి టీచర్‌ను చితకబాదారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని అవిలాల పంచాయతీలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని రూరల్ ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ నరసనాయుడు వివరాల మేరకు... అవిలాల పంచాయతీకి చెందిన వెంకటేష్, సాయి తేజ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నారు. గురువారం దాడులు చేసి, విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన గంజాయిని సీజ్ చేసి, వారిని అరెస్టు చేశారు.



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి తదితరులు

మన సంస్కృతిని పరిరక్షించుకోవాలి

'విరించి' ముగింపు కార్యక్రమంలో వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి




తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవలసిన బాధ్యత ఈ తరంపై ఉందని ఎస్వీ వేద విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ వేదికగా రెండు రోజులుగా నిర్వహించిన విరించి-2కె25 కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ ముగింపు సభలో వీసీ మాట్లాడుతూ.. విరించి కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మక భావాలను వెలికి తీయడం అభినందనీయమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా కళలు ఉన్నాయనారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక అంశాలకు కూడా వర్సిటీ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శించడానికి విరించి చక్కని వేదికగా నిలిచిందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని పేర్కొన్నారు. రెండో రోజున ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





వినయమూ అవసరమే



చిన్నారికి పట్టా అందజేస్తున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(గాంధీరోడ్డు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు వినయమూ కలిగి ఉండాలని, మన సంస్కృతి పట్ల గౌరవభావం పెంచుకోవాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్ పేర్కొన్నారు. భారతీయ విద్యాభవన్ శ్రీవేంకటేశ్వర విద్యాలయలో గురువారం యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుమార్ మాట్లాడుతూ విద్యార్థి జీవితానికి కిండర్ గార్డెన్ పునాదివంటిదని, విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, విలువలను పెంచి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ రాజు, హెచ్ఎం వాణిశ్రీతో కలసి విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వందేమాతరం శ్రీనివాస్, రూపేష్ ప్రభు, పక్కనే చక్రవర్తిరెడ్డి

తిరుపతి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాలాజీకాలనీలోని ఎస్డీహెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, ఇస్కాన్‌కి చెందిన రూపేష్ ప్రభు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదవడాన్ని అలవర్చుకోవాలన్నారు. మంచి వారితో స్నేహం చేయడం వల్ల జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. సెల్‌ఫోన్లను అవసరమైన మేరకే వాడుతూ చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. వందేమాతరం శ్రీనివాస్ బృందం నిర్వహించిన సినీ గీతాలపన ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు స్థలాన్ని పార్కింగ్‌కు వాడుకుంటున్నారు..

తిరుపతి (జీవకోన), మార్చి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వ్యక్తిగత పార్కింగ్‌కు వాడుకుంటున్నారని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయం వంశీ ఆరోపించారు. దీనిపై వైసీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో స్కావెంజర్స్ కాలనీ వద్ద గురువారం ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. కూటమి నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు వాసుదేవయాదవ్, శేఖర్‌రాయల్, కార్పొరేటర్ తమ్ముడు గణేష్, పసుపులేటి సురేష్, అమర్‌నాథరెడ్డి, దినేష్ రాయల్, అనిల్‌రెడ్డి, సాయిలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్ల జయంతి



మొల్లకు నివాళులర్పిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి డీఆర్వో నరసింహులు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణాన్ని కవయిత్రి మొల్లమాంబ సంస్కృతం నుంచి సామాన్యులకు అర్థమయ్యే విధంగా తెలుగులోకి అనువదించారని తెలిపారు. కేవలం ఐదు రోజుల్లో ఈ కావ్యాన్ని రచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జ్యోత్స్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్మాండ్, జిల్లా సమాచార శాఖ అధికారి బాలకొండయ్య, కలెక్టరేట్ ఏవో భారతి తదితరులు పాల్గొన్నారు.

మత ప్రాతిపదికన డాక్టర్ల నియామకాలను రద్దు చేయాలి

విద్యార్థి సంఘాల నేతల డిమాండ్



స్విమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘ నేతలు

తిరుపతి(వైద్యం). మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో డాక్టర్ల నియామకాలకు ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ రాజ్యాంగ విరుద్ధంగా ఉందని, మత ప్రాతిపదికన విడుదల చేసిన ఆ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘ నేతలు గురువారం స్విమ్స్‌లో ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన విడుదల చేసిన నోటిఫికేషన్‌లో హిందువులు మాత్రమే అర్హులని పేర్కొనడం సరికాదన్నారు. అనంతరం స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నేతలు చలపతి, రవి, ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, భార్గవ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో క్రియాశీలకంగా వ్యవహరించాలి

తిరుపతి (జీవకోన), మార్చి 13(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా వ్యవహరించాలని వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా శక్తివంతమైన సాధనమని, దాన్ని ఉపయోగించుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

నేడు 'తమసోమా జ్యోతిర్గమయ' పుస్తకావిష్కరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కవి తోట వెంకటేశ్వర్లు రాసిన తమసోమా జ్యోతిర్గమయ పుస్తకావిష్కరణ సభ శుక్రవారం నిర్వహించనున్నారు.ఉదయం 10గంటలకు తిరుపతిలోని యూత్‌హాస్టల్లో ఈ తరం కవితావేదిక ఈకార్యక్రమాన్ని నిర్వహించనుంది.

రిటైర్డు ప్రొఫెసర్ మృతి



చలపతి (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పొలిటికల్ సైన్స్ రిటైర్డు ప్రొఫెసర్ బీవీ చలపతి (67) మృతిచెందారు. కొన్ని రోజుల క్రితం శ్వేత బిల్డింగ్ ముందు రోడ్డు మీద ప్రమాదానికి గురయ్యారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్విమ్స్‌లో చేర్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మృతి చెందారు. మదనపల్లె ప్రాంతానికి చెందిన ఆయన ఎస్వీయూ పరిధిలోనే చదువుకుని, అధ్యాపకులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. కుమార్తె అమెరికాలో ఉండడంతో అంత్యక్రియలు ఇంకా నిర్వహించలేదు. చలపతి మృతి పట్ల వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ సుధారాణి, పొలిటికల్ సైన్స్ హెడ్ మురళీధర్, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

అన్నదాన సత్రాలు కూల్చడం ఏ సనాతన ధర్మం?

తిరుపతి(ఆటోనగర్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో 40 ఏళ్లుగా కులమతాలకతీతంగా అన్నదానం చేస్తున్న ఆశ్రమాలు, సత్రాలను కూల్చడం ఏ సనాతన ధర్మంలో ఉందో సనాతన వాది అని చెప్పుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పాలని సీపీఎం నాయకులు కందారపు మురళి గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కడప జిల్లా బద్వేలు నియోజకవర్గం కాశీనాథుని జ్యోతి క్షేత్రంలో సత్రాలను, ఆశ్రమాలను కూల్చడమేగాక అక్కడున్న గోశాలను బలవంతంగా తరలించడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ దాడికి నిరసనగా ఈనెల 17న కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు చేస్తామని విజయశంకరస్వామి ప్రకటించడం హర్షణీయమని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ప్రజలకు క్షమాపణ చెప్పడమేగాక సొంత నిధులతో కూలిన నిర్మాణాలను తిరిగి నిర్మిస్తామని ప్రకటించడం శుభపరిణామమని పేర్కొన్నారు.

రచయిత రమేష్‌కు అభినందన

తిరుపతి(గాంధీరోడ్డు), మార్చి13(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైదుకూరు పట్టణానికి చెందిన రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్‌ను తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు గురువారం అభినందించారు. కొన్ని సంవత్సరాలుగా వీరగల్లులు, శాసనాలు, పురాతన ఆలయాలను వెలుగులోకి తీసుకొచ్చి చరిత్ర పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సాహిత్య సేవలోనూ భాగస్వామ్యం కావడం అభినందనీయమని అన్నారు. తాను రచించిన జక్కదొన పుస్తకాన్ని రమేష్‌కు బహూకరించగా.. మడకెద్దులు పుస్తకాన్ని రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం అందించారు. కథా రచయిత నాగార్జునశర్మ పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత

తిరుపతి(నేరవిభాగం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హోంగార్డుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. గురువారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో హోంగార్డుల సంక్షేమానికి రూ.20.90 లక్షల ఆర్థిక సాయం అందించారు. తొమ్మిది మంది హోంగార్డులకు రూ.10 వేలు చొప్పున రూ.90వేలు అందజేశారు. రిటైర్డు అయిన బి.నాగరాజన్, పురుషోత్తమ్, పద్మావతిలకు రూ.5లక్షల చొప్పున రూ.15 లక్షలు అందజేశారు. గత ఏడాది ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన గోవర్ధననాయుడు తమ్ముడు విజయకుమార్‌కు రూ.ఐదు లక్షల చెక్కు ఇచ్చారు.

వెటర్నరీ విద్యార్థుల మానవహారం



తిరుపతిరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారమూ కొనసాగింది. ఇందులో భాగంగా విద్యార్థులు వర్సిటీ నుంచి ర్యాలీగా బయలుదేరి బాలాజీకాలనీ సర్కిల్‌కు చేరుకుని మానవహారం చేపట్టారు. స్టైఫండ్ పెంచాలని నినాదాలు చేశారు. వీరికి ఏఐఎస్ఎఫ్ నేతలు సంఘీభావం తెలిపి, మద్దతు ప్రకటించారు. అంతకుముందు ఎస్వీయూ ప్రధాన ద్వారం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులతో కలసి నిరసన తెలిపారు. తిరిగి వర్సిటీకి చేరుకుని ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో సమ్మెను కొనసాగించారు.

సంపద సృష్టికే చెత్తతో సంపద తయారీ కేంద్రాలు

బాలాయపల్లి, మార్చి 13: సంపద సృష్టించి పంచాయతీలు నిధులు సమకూర్చుకునేందుకు చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నిండలి, అలిమిలి, బాలాయపల్లి, వెంగమాంబపురం, కయ్యూరు, కొట్రగుంట, కామకూరు, సిద్ధాగుంట, హస్తకావేరి, జయంపు గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాల్లో వానపాములను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానపాములతో ఎరువులు తయారుచేసి విక్రయించ ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ రవి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్ సేవలు ప్రశంసనీయం



ల్యాబ్‌టెక్నీషియన్లను సన్మానిస్తున్న ప్రగతిసేవా సంస్థ సభ్యులు

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైద్యవిభాగంలో ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు ప్రశంసనీయమని ప్రగతిసేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ల్యాబ్‌టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో పని చేస్తున్న ట్యాబ్‌టెక్నీషియన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా, డాక్టర్ రవికుమార్, కమల్‌రాజా, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పెంచలయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దీపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం మాధవిలక్ష్మి

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి దీపిక ఎంపిక కావడం సంతోషమని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవిలక్ష్మి అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన దీపికను గురువారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లాలోని పులివెందులలో జరగనున్న పోటీలలో దీపిక పాల్గొంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, లత పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినులకు పరీక్షాసామగ్రిని అందజేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. గురువారం స్థానిక ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో అరవ వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అరవ పార్వతయ్య, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి

చిల్లకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు తప్పనిసరిగా మమోగ్రామ్, పాప్‌స్మియర్ వంటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేయించు కోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ షాలోమ్‌ఆరాఫత్ అన్నారు. గురువారం మండలంలోని ముత్యాల పాడు, కడివేడు గ్రామాల్లో స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చైతన్యభాను, పద్మావతి, సూపర్‌వైజర్లు రవికుమార్, మునిలక్ష్మి, సర్పంచులు వెంకటమ్మ, హరిత, పంచాయతీ కార్యదర్శులు ఆలీబాషా, రమాదేవి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడి పుట్టినరోజు



గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం టీటీడీ పాలకమండలి సభ్యుడు, టీడీపీ నాయిబ్రాహ్మణ సాధికారసమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతారామ్ పుట్టినరోజు వేడుకలను నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో గోపాల్, శ్రీనివాసులు, ప్రతాప్, మస్తాన్, గురునాథం పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి

● శాసనసభలో ఎమ్మెల్యే విజయశ్రీ విజ్ఞప్తి



తడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట నియోజకవర్గంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విన్నవించారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో 4,420 టిడ్కో ఇళ్లు 2018 చివరినాటికి 90శాతం పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన 10శాతం పనులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో ఆ ఇళ్లు అలాగే ఉండిపోయాయన్నారు. మౌలిక వసతులను కల్పించి వాటిని త్వరగా లబ్ధిదారులకు అందజేయాలని సంబంధిత మంత్రికి ఆమె విన్నవించారు.

మహాలక్ష్మికి హోమపూజలు

గూడూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో గురువారం మహాలక్ష్మి అమ్మవారి జయంతి సందర్భంగా హోమపూజలు నిర్వహించారు. నిర్వాహకుడు కోట సునీల్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బస్సును ఢీకొన్న కారు ఒకరికి స్వల్ప గాయాలు



వెంకటగిరిటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా కారు అదుపుతప్పి బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం చక్రంపేట గ్రామానికి చెందిన బి.మునికృష్ణయ్య చెన్నై నుంచి వెంకటగిరి మీదుగా కారులో వారి స్వగ్రామానికి వెళ్తున్నాడు. పట్టణంలోని నాయుడు పేట రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్ మలుపు వద్ద మేనకూరు సెజ్‌కు చెందిన గ్రీన్‌టెక్ బస్సు ఎదురుగా వచ్చింది. ఉదయం పొగ మంచు ఎక్కువగా ఉండడంతో అదుపు తప్పి ఆ బస్సును ఢీకొన్నాడు. దీంతో మునికృష్ణయ్య తలకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జంతుశాస్త్ర విభాగ అధిపతి శ్రీనివాసులు, పక్కనే ప్రిన్సిపాల్ శంకర్ శర్మ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకం అని సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, నాగభూషణం పాల్గొన్నారు.

నేత్రదానం



అనసూయమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ద్వారా నేత్రదానం చేసిన వారి సంఖ్య గురువారం 458కి చేరింది. సూళ్లూరుపేట బాపూజీవీధికి చెందిన సోమిశెట్టి అనసూయమ్మ (89) మరణాంతరం ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో చెన్నై శంకరనేత్రాలయకు నేత్రదానం చేశారు. దీంతో నేత్రదాతలు 458 అయ్యారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, సాయిరాం తదితరులు ఉన్నారు.

పిఠాపురం తరలిన జనసైనికులు

వెంకటగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరి నుంచి పెద్ద ఎత్తున జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పిఠాపురం తరలివెళ్లారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త జంపాల ప్రకాష్ ఆధ్వర్యంలో మొదట గ్రామ శక్తి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత విశ్వోదయ గ్రౌండ్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన బస్సులు, కార్లలో ర్యాలీగా బయలు దేరి వెళ్లారు.

పేట బస్టాండ్‌లో సమస్యల హాల్ట్.. !

● వసతులు కరువు
● అవస్థల్లో ప్రయాణికులు





శ్లాబ్ నుంచి ఊడిపడుతున్న సిమెంటు పెచ్చులు, బస్టాండ్ లోపలికి వచ్చిన ప్రైవేట్ వాహనాలు

నాయుడుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల హాల్ట్ నానాటికీ అధికమైపోతోంది. ఓజిలి, చిట్టమూరు, పెళ్లకూరు, దొరవారిసత్రం, కోట మండలాలతో పాటు మహానగరాలకు కూడా కూడలి ప్రాంతం కావడంతో ప్రయాణికుల రద్దీ ఇక్కడ అధికంగా ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ బస్టాండ్ అధ్వానంగా ఉంది. పైభాగ పెచ్చులు ఊడిపోయింది. ఇక ప్రయాణికులు కూర్చోవడానికి సరైన కుర్చీలు లేవు. ఉన్నవి చాలావరకు విరిగిపోయాయి. ఇక మరుగుదొడ్లు కాస్త దూరంగా బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. బస్టాండులో ఉండేవారు దుర్గంధం భరించలేక ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్లలో సరైన నీటి వసతి లేదు. శుభ్రత అనే పూర్తిగా కనిపించదు. ఇక ప్రైవేటు వాహనదారులు బస్టాండు ఆవరణలోకి వచ్చి ప్రయాణికులను తరలిస్తున్నా, ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్నా పట్టించుకునేవారు లేదు. పట్టించుకోవాల్సిన డిపో మేనేజర్లు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఈ బస్టాండు ఎవరి పరిధో తేల్చుకోవడంలోనే వాకాడు, గూడూరు డిపోల మేనేజర్లు ఉన్నారు. దీంతో నాయుడుపేట బస్టాండు అధ్వానంగా మారిపోయింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండు ఏ డిపో పరిధిలోకి వస్తుందో తేల్చి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎన్‌ఎంయూ



ధర్నా చేస్తున్న ఎన్‌ఎమ్‌యూ నాయకులు

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌ఎంయూ నాయకులు కోరారు. గురువారం ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు రెడ్ రిబ్బన్‌లు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు డిపో నుంచి తిరుమలకు, బెంగళూరుకు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆర్టీసీ ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువచ్చినా ఇప్పటివరకు డిపో మేనేజర్ నోట్‌ఫైల్‌ను సిద్ధం చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. డిపో సిబ్బందికి రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా కండక్టర్లకు చైల్డ్‌కేర్ సెలవులు ఇవ్వాలన్నారు. ఉన్నాతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, ప్రవీణ్, శ్రీనివాసులు, గౌస్, కృష్ణ, రమేష్, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పారిశుధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్న ఎంఎం పద్మజ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నేటి ప్రపంచంలో పురుషులతో సమానంగా పోటీపడి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రామలింగ చౌడేశ్వరిదేవి మహిళా సేవాసమితి గౌరవ అధ్యక్షురాలు మన్నెముద్దు పద్మజ అన్నారు. గురువారు పట్టణంలోని పార్కువీధిలో ఉన్న దేవాంగుల సంఘం కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించారు. ముందుగా మున్సిపాలిటీలో పనిచేసే మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామలింగ చౌడేశ్వరి దేవి మహిళా సేవాసమితి కార్యదర్శి బండారి శారద, విజయలక్ష్మి, త్రివేణి, కృష్ణవేణి, చంద్రలక్ష్మి, శైలజ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

20.40 లక్షల చేపపిల్లల పంపిణీ

● సొసైటీ చెరువులకు ఉచితంగా అందజేత
● గూడూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘుబాబు



ఓజిలి పెద్దచెరువులో చేప పిల్లలు వదులుతున్న ఫిషరీస్ అసిస్టెంట్ పుష్పరాజ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్‌రావు, సొసైటీ సభ్యులు

ఓజిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గూడూరు డివిజన్ మత్స్యశాఖ పరిధిలోని ఓజిలి, ఇనుగుంట (ఓజిలి మండలం), జీలపాటూరు (పెళ్లకూరు మండలం)తోపాటు చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలో 25 సొసైటీ చెరువులకు 20.40 లక్షల చేప పిల్లలను ఉచితగా అందజేసినట్లు ఆ శాఖ గూడూరు డివిజన్ అభివృద్ధి అధికారి రఘుబాబు తెలిపారు. ఓజిలిలోని పెద్దచెరువులో చేప పిల్లలను వదిలేందుకు గురువారం 90 వేల చేప పిల్లలను చేపల సొసైటీ సభ్యులకు ఉచితంగా అందజేశారు. ఆశాఖ సహాయకుడు పుష్పరాజ్ అధ్వర్యంలో సొసైటీ సభ్యులు స్థానిక టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు చేతుల మీదుగా వాటిని చెరువులో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్రమణ్యం, ఆయకట్టు అధ్యక్షులు షేక్ ఆయోషా, ఉపాధ్యక్షులు ముమ్మడి శ్రీనివాసులు, నాయకులు షేక్‌రఫీ, జయచంద్రారెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. ● మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘుబాబు ఫోన్‌లో మాట్లాడుతూ మండలంలోని ఇనుగుంట చేపల సొసైటీకి కూడా లక్ష చేప పిల్లలను అందజేసినట్లు తెలిపారు. ఇంకా కొన్ని చేపల సొసైటీల నుంచి ప్రతిపాదనలు రాలేదని అవి వచ్చిన తరువాత అన్ని సొసైటీలకు చేపపిల్లలు అందజేస్తామని తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు

తడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల కార్పొరేషన్లకు సంబంధించి ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన ఈ ఇంటర్వ్యూలకు 252 మంది హాజరుకాగా 21 మంది గైరుహాజరయ్యారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో విజయ్‌కుమార్, బ్యాంక్ మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు బీవీపాళెం పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

తడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బీవీపాళెం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మురళీ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో వివిధ లైన్‌ల మార్పు, మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 6 నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పిఠాపురం బయలుదేరిన జనసేన నాయకులు

కోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాలకు కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులు కోట నుంచి రెండు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లంబాబు, హరీష్, గూడూరు కృష్ణ, కోటేశ్వరరావు, మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

పైపులైన్ల ధ్వంసం అధికారుల పరిశీలన

కోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద సాగరమాల రోడ్డు పనుల విస్తరణలో పైపులైన్లు ధ్వంసం కావడంతో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సందర్శించారు. పగిలిన పైపు లైన్‌లను యుద్ధప్రాతిపదికన బాగుచేయించి నెల్లూరుపల్లి, కొత్తపాళెం గ్రామాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని.. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్, జేఈ అరవింద్ తెలిపారు.

టీటీడీ సీవీఎస్వోగా ఎస్పీ బాధ్యతల స్వీకారం



హర్షవర్ధన్‌రాజుకు లడ్డూప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

తిరుమల, మార్చి13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ సీవీఎస్వోగా గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో గురువారం ఆలయంలో బాధ్యతలు చేపట్టి శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా, డిప్యూటీఈవో లోకనాథం లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో నేడు పౌర్ణమి గరుడ సేవ

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య సర్వాంకార భూషితుడైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

● అలాగే, శుక్రవారం తిరుమలలో కుమారధార తీర్థ ముక్కోటి కూడా జరగనుంది. భక్తులను ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తీర్థానికి అనుమతించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో తాగునీరు, అన్నప్రసాదాలు అందజేయనున్నారు.

అవగాహన లోపంతో హక్కులు కోల్పోతున్నారు



మాట్లాడుతున్న జస్టిస్ డాక్టర్ ఎస్‌వీఎన్ భట్టి

తిరుపతి(వైద్యం), మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించినా వాటిపై అవగాహన లోపం వల్ల అనుభవించలేకపోతున్నారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ఎస్‌వీఎన్ భట్టి పేర్కొన్నారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో చట్టం, మహిళా సాధికారిత అనే అంశంపై గురువారం నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానులనే విషయాన్ని దృఢంగా విశ్వసించాలన్నారు. అప్పుడే వారి హక్కులను స్వతంత్రంగా పొందగలరని తెలిపారు. అనంతరం విద్యార్థులు మహిళా సాధికారిత, లింగ సమానత్వం గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎంఎస్ రామ్, డీన్ అల్లాడి మోహన్, ప్రిన్సిపాళ్లు ఉషా కళావత్, మాధవి, సుధారాణి పాల్గొన్నారు.

ఏపీ పాలిసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(గాంధీరోడ్డు), మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఏపీపాలిసెట్-2025కి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్వీ రమణకుమార్ గురువారం తెలిపారు. టెన్త్ పాసైన.. ఈ ఏడాదిలో పరీక్షలు రాయబోవు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 'ఏపీపాలిసెట్.ఏపీ.ఎన్ఐసీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేయాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.100, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.400ఫీజు చెల్లించాలని తెలిపారు. సమీప ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో సంప్రదించి దరఖాస్తు చేయవచ్చని, అలాగే తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. వివరాలకోసం హెల్ప్‌లైన్ ఇన్‌చార్జి కమల్‌నను 99851 29995లో సంప్రదించాలని సూచించారు. కాగా ఏప్రిల్ 30న తిరుపతి, సత్యవేడు, గూడూరులోని కేంద్రాల్లో పాలిసెట్ నిర్వహిస్తామని వివరించారు. అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో వచ్చేనెల ఒకటి నుంచి పాలిసెట్ ప్రవేశపరీక్షకు ఉచిత శిక్షణతోపాటు స్టడీమెటీరియల్ అందిస్తామన్నారు.

పుత్తూరు వార్తలు

బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో జాప్యం

● పుత్తూరు పట్టణ పరిధిలో 60 యూనిట్ల లక్ష్యం
● స్వయం ఉపాధి రుణాల కోసం 688 మంది దరఖాస్తు



మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు (ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బీసీ కులాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతకు స్వయం ఉపాధి కల్పనకు గాను అర్హులకు రాయితీ రుణాలు కల్పించడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఈ పథకానికి పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో భారీగా దరఖాస్తులు అందాయి. 60 యూనిట్లకు గాను 688 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత నెల 12వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. అదే నెల 21వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకర్లు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాగా, ఒక రాయితీ రుణం పొందేందుకు 12 మంది దరఖాస్తుదారులు పోటీ పడుతున్నారు. బ్యాంకర్లు కూడా దరఖాస్తుదారుల స్వయం ఉపాధి వాస్తవికతలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియతో నేటికీ అర్హులకు రుణ మంజూరులో తీవ్ర జాప్యం నెలకొంది. ప్రభుత్వ రాయితీ రుణాల పథకానికి దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు దరఖాస్తు చేసుకున్నారు. బీసీలు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు యూనిట్ ఏర్పాటుకు రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకు మూడు స్థాయిల్లో రాయితీ రుణాలు మంజూరు చేస్తారు. ఇందులో ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంది. మిగతా మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణంగా పొందాల్సి ఉంది. బ్యాంకర్ల రుణ మంజూరు జాప్యం కారణంగా ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత గడువులోపు యూనిట్లు కార్యరూపం దాల్చేలా కనిపించడం లేదు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు

పుత్తూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు మీద భరోసా కల్పిస్తూ బాధలు మరచిపోయేలా రోగులకు మెరుగైన సేవలు అందించాలని నర్సింగ్ విద్యార్థులకు విశ్రాంత ప్రిన్సిపాల్ వరలక్ష్మి ఉద్బోధించారు. స్థానిక కేకేసీ నర్సింగ్ కళాశాలలో గురువారం ఘనంగా వీడ్కోలు సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ డాక్టర్ల చికిత్స తర్వాత రోగులు త్వరగా కోలుకునేందుకు నర్సుల సేవలే ప్రధానమని చెప్పారు. విదేశాల్లో నర్సుల కొరత ఎక్కువగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కుప్పయ్య శెట్టి, ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పుత్తూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యూజీసీ సూచన మేరకు రాష్ట్రంలోనే అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక అధ్యయన కేంద్రం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్ వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ కొత్త విద్యా సంవత్సరంలో పీజీ, డిగ్రీ, డిప్లొమాలకు వెంటనే అడ్మిషన్లు ప్రకటించాలని, లేకపోతే ఓ విద్యాసంవత్సరం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న దామోదరరెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విభ ఇంగ్లీష్ వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి జాతీయ సైన్స్ వారోత్స వాల్లో మీకు నచ్చిన శాస్త్రవేత్త అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో పట్టణంలోని కుమారస్వామితిప్ప పురపాలక సంఘ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న అబ్దుల్ ఘని రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం సాధించాడు. జిల్లా స్థాయి పోటీల్లో షేక్ హుస్నా మొదటి స్థానం సాధించింది. వీరిని గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరరెడ్డి ఘనంగా సన్మానించారు. మరింత ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ ఇన్‌చార్జి అన్సర్ హుస్సేన్, నాయకులు కరీముల్లా షక్రుద్దీన్, సురేంద్రరెడ్డి, సలీం, జిలాని, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన రిలే దీక్షలు


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రిలే దీక్షలు చేస్తున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులు ఇంటి స్థలాల కోసం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఇంటి స్థలాలు ఇచ్చే వరకు తాము దీక్షలు కొనసాగిస్తామని దళితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగా మాస్టర్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు


అవార్డులతో ఆయిలం సుజాత

శ్రీకాళహస్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన యోగా మాస్టర్ ఆయిలం సుజాతకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. బెంగళూరులో గురువారం వివేకానంద ఇంటర్నేషనల్ ప్రగతి యోగ కల్చరల్ అకాడమీ, అజంతా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో గ్లోబల్ భారత్ టాలెంట్ సమ్మిట్‌లో భాగంగా సుజాతకు అఖిల భారత జీవితకాల సాధన అవార్డు అందించారు. దేశవ్యాప్తంగా పది సంవత్సరాల పైబడి యోగా సాధనలో సేవలందించిన మాస్టర్లకు ఈ అవార్డులను అందించారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి వాసిగా ఈ అవార్డు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

● మహిళ మృతి - ఇద్దరికి గాయాలు


మృతి చెందిన రజనమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని వెనకవైపు నుంచి లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని వెస్ట్‌వరత్తూరు గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... శ్రీకాళహస్తి మండలం రామాపురం గిరిజన కాలనీకి చెందిన రజనమ్మ(30) భర్త రమణయ్య, మామ సుబ్బరామయ్యతో కలసి వరదయ్యపాళెం మండలం పెద్దపాండూరు గ్రామంలోని బంధువుల ఇంటికి గురువారం ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని శ్రీకాళహస్తి-తడ రోడ్డులో వెస్ట్‌వరత్తూరు గ్రామం దగ్గర చెన్నై వెళుతున్న లారీ వేగంగా వెనుక భాగంలో ఢీకొంది. దీంతో రజనమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, రమణయ్య, సుబ్బరామయ్యకు గాయాలు కావడంతో వారిని 108 ద్వారా శ్రీకాళహస్తికి చికిత్స కోసం పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

వైభవంగా గురు దక్షిణామూర్తికి పూజలు


ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురు దక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

తిరుపతి, మార్చి13(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఆనంద రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆయనను రేణిగుంట ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన ఆయనను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంటు రైటర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని చూపు కోల్పోయిన యువకుడు


ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన యువకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రేణిగుంట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఓ యువకుడు చూపు కోల్పోయిన సంఘటన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వేణుగోపాలపురానికి చెందిన అద్భుతరాజ్ (28) స్థానికంగా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు ద్విచక్ర వాహనంపై చెక్‌పోస్ట్ వైపు వెళ్తుండగా.. ఎర్రావారిపాలెంకు చెందిన వంశీ ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి మలుపు వద్ద ఢీకొట్టడంతో అద్భుతరాజ్ కన్నుకు హ్యాండిల్ గుచ్చుకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం అమర హాస్పిటల్‌కు తరలించగా అక్కడ వైద్యులు ఎడమ కన్ను చూపు కోల్పోయాడని తెలిపారు. దీంతో అద్భుతరాజ్ బంధువులు రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ అరుణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురానికి తరలిన జనసైనికులు


పిఠాపురం బయలుదేరుతున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం నిర్వహిస్తున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు శ్రీకాళహస్తి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆధ్వర్యంలో నాలుగు మండలాల నుంచి జనసేన నాయకలు, కార్యకర్తలు, వీరమహిళలు గురువారం బయలుదేరారు. ఏపీసీడ్స్ సర్కిల్ జనసేన శ్రేణుల నినాదాలతో మారుమోగింది. బయలుదేరినవారిలో నాయకులు భాస్కర్‌బాబు, శివకుమార్, చంద్రశేఖర్, చిన్న, నాగరాజు, గణేష్, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం జనసేన మండలాధ్యక్షుడు చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఛలో పిఠాపురం కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు గురువారం పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఇందులో పరశురామ్, తులసి, బీఎన్‌కండ్రిగ మండలాధ్యక్షుడు బాషా తదితరులున్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రతిభ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా గురువారం పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణతా శాతం సాధించి పాఠశాలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్తేర్ రాణి, సంస్థ సభ్యులు మల్లీశ్వరి, బాబా ఫరీద్, వాసుదేవరరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి


విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శనరావు - యాంకరింగ్ అలరిస్తున్న హీరోయిన్ సంయుక్త మీనన్, యాంకర్ భానుశ్రీ

నారాయణవనం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యసాధనలో భాగంగా మరొకరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శనరావు పేర్కొన్నారు. గురువారం సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జుబిలేషన్ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుదర్శనరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు లక్ష్యసాధన వైపు అడుగులు వేయాలని సూచించారు. కళాశాల చైర్మన్ అశోక్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్‌తో పాటు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో కూడా రాణించాలని, అప్పుడే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు పేరు తీసుకుని వచ్చే విధంగా రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ హీరోయిన్ సంయుక్త మీనన్, యాంకర్ భానుశ్రీ విచ్చేసి కార్యక్రమాన్ని ఉల్లాసభరితంగా నడిపించారు. అకడమిక్ కెరీర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ అవార్డులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్స్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు, వైస్ ప్రిన్సిపాల్ గోపీనాథ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జనసేన నాయకులు చంద్రశేఖర్, పేట చిరంజీవి, వెంకటరమణ యాదవ్, తోట గణేష్, ఉదయ్, హేమంత్‌కుమార్, ప్రదీప్‌కుమార్, మణి, మునిచంద్ర, హరి, సాయి, చందు, మహేష్, కవిత, శారద, గాయత్రి, బత్తెమ్మ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కార దిశగా రీసర్వే

● తప్పులను సరిచేసి పక్కాగా చేపట్టాలి
● కలెక్టర్ వెంకటేశ్వర్


భూరికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్

శ్రీకాళహస్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యల పరిష్కారదిశగా రీసర్వే ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తొట్టంబేడు మండలం బోనుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, స్థానిక రైతులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశం నిర్వహించారు. రీసర్వేపై పలు సూచనలుచేశారు. ఆయన మాట్లాడుతూ తొట్టంబేడు మండలం బోనుపల్లిలో గతంలో జరిగిన రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసి పక్కాగా చేపట్టనున్నట్లు రైతులకు తెలిపారు. రీసర్వే, రెవెన్యూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన రైతుల సమస్యలను తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, ఆర్డీవో క్షేత్రస్థాయిలో ఎలా పరిష్కరిస్తున్నారో తెలుసుకోవడానికి తాను బోనుపల్లికి వచ్చినట్లు ఆయన చెప్పారు. గ్రామంలో రీసర్వే వలన జాయింట్ ఖాతాలు, వన్‌బీ సమస్యలు, భాగపరిష్కారం, సాదాబైనాబి అయి సాగులో ఉన్న వారికి పట్టాలు లేకపోవడం వంటి సమస్యలను తెలుసుకున్నట్లు తెలిపారు. కాళంగి నది వలన పంట పొలాలు మునిగిపోయాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రోజువారి ప్రణాళికతో క్షేత్రస్థాయిలో గ్రామ సమస్యలను ఎలా పరిష్కారం చూపాలో ఆర్డీవో, తహసీల్దారుకు సూచించారు. రైతులతో సమావేశం నిర్వహించి ఎలాంటి అవకతవకలు లేని రీసర్వే నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల వలన పంట నష్టపరిహారం కూడా పొందలేకపోయారని, ధాన్యం సేకరణ అవకాశం ఉన్నా సంబంధిత వ్యవసాయాధికారుల అవగాహన లోపం వలన ఈ ప్రక్రియ జరగలేదని తెలిపారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు మధుసూదన్‌రావు, సర్వేయర్ హరినాథ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు గురైన మినరల్ వాటర్ ఏటీఎం


కళత్తూరులో మరమ్మతులకు గురైన మినరల్ వాటర్ ఏటీఎం

కేవీబీపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో గతంలో ఎంపీగా ఉన్న వరప్రసాద్ తాగునీటి సమస్య పరిష్కారం కోసం దళితవాడలో మినరల్ వాటర్ ఏటీఎం యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఆరు నెలలుగా ఈ యంత్రం మరమ్మతులకు గురై పనిచేయడం లేదు. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి సమస్య తమ గ్రామానికి ఎక్కువగా ఉందని అంటున్నారు. అధికారులు స్పందించి ఈ యంత్రానికి మరమ్మతులు చేయించి తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా మండల పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా హరిహర తీర్థంలో వెలసిన అన్నపూర్ణేశ్వరి సమేత హరహరేశ్వర స్వామి ఆలయంలో గురువారం మండల అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇటీవల ఆలయాన్ని పునర్నిర్మించి కుంభాభిషేకం చేశారు. 41 రోజులు పూర్తి కావడంతో మండల పూజలు చేశారు. ఆలయ ఏఈవో లోకేష్‌రెడ్డి, దక్షిణామూర్తి, అర్చకులు అర్ధగిరి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో కంచె వేసేందుకు యత్నం

● అడ్డుకొని తొలగించిన రెవెన్యూ సిబ్బంది


కంచె తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రేణిగుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిలో కంచె వేస్తుండగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకొని తొలగించిన సంఘటన గురువారం ఉదయం పాత విమానాశ్రయం రోడ్డులో నూతన హైవే పక్కన చోటు చేసుకుంది. కొత్తపాళ్యం వీఆర్వో శంకర్ తెలిపిన వివరాల మేరకు... కొత్తపాళ్యం రెవెన్యూ గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 93/3లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇందులో దాదాపు మూడు ఎకరాలు నూతన హైవే నిర్మాణానికి తీసుకున్నారని, హైవే పక్కన మిగిలిన 99 సెంట్ల భూమిలో గతంలో కొంత మంది కంచె వేస్తుండగా అడ్డుకొని తొలగించామని చెప్పారు. ఈ భూమిపై హైకోర్టులో కేసు నడుస్తుండగా నేడు తిరిగి కంచె వేస్తుండగా, అడ్డుకొని తరిమేసామని తెలిపారు. ఈ సందర్భంగా పద్మిని అనే మహిళ తాము డీకేటీ పట్టాను గతంలో కొనుగోలు చేశామని... రోడ్డు విస్తీర్ణంలో తమ భూమి మూడు ఎకరాలు నష్టపోయామని.. ఇప్పటికీ నష్ట పరిహారం చెల్లించలేదని.. మిగిలిన తమ భూమిలో కంచె వేస్తుండగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయంపై తహశీల్దార్ సురేష్ బాబుని వివరణ కోరగా.. ప్రభుత్వ భూమిలో కంచె వేసేందుకు ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారని తెలిపారు.

కూల్‌కింగ్ పరిశ్రమ వద్ద కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

వరదయ్యపాళెం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు సమీపంలోని కూల్‌కింగ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు తమకు వేతనాలు సక్రమంగా అందించడం లేదని గురువారం ఆందోళనకు దిగారు. విధులను బహిష్కరించి పరిశ్రమ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గత ఏడాదిగా కార్మికులకు ఇస్తున్న వేతనాన్ని మూడు నెలలకొకసారి ఇస్తున్నారన్నారు. దీంతో తాము అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించలేకపోతున్నామని, అపరాధరుసుంతో చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఫీజులు, కుటుంబ అవసరాలకు, పోషణకు గత్యంతరం లేక అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. నెలనెలా జీతం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లమాల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 55 మంది విద్యార్థులకు ఇదే పాఠశాలలో 2004-2005లో చదివిన పూర్వ విద్యార్థి యుగంధర్ గురువారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. దాత మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల చదువుకు తన వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని శ్రీకాళహస్తి-తడ రోడ్డులోని కారణిమిట్ట సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... కేవీబీపురం మండలం కోవనూరుకు చెందిన క్రాంతికుమార్(25) బీఎన్‌కండ్రిగ మండలంలోని కుక్కంబాకంలోని మేనత్త ఇంట్లో ఉంటూ శ్రీసిటీలోని యూనీచామ్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వరదయ్యపాళెం నుంచి కుక్కంబాకానికి వస్తుండగా కారణిమిట్ట మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి ఎస్ఐ విశ్వనాథనాయుడు సిబ్బందితో చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆటోలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుట్టు మిషన్ కోసం దరఖాస్తు చేసుకోండి

పిచ్చాటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పేద మహిళల స్వయం ఉపాధికై ఏపీ ప్రభుత్వం ఉచిత కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ పథకం ప్రారంభించిందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మహ్మద్‌రఫీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారులు ఏపీలో నివాసం ఉంటూ ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు 20 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.ఒకటిన్నర లక్ష, పట్టణ ప్రాంతాల్లో రూ.రెండు లక్షలకు మించి ఆదాయం ఉండరాదన్నారు. వితంతువులు, దివ్యాంగ మహిళలకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో హాజరు 70 శాతం ఉంటేనే కుట్టు మిషన్ ఇస్తారని తెలిపారు. ప్రస్తుతం బీసీ, ఈడబ్ల్యుఎస్ కులాలకు చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. హౌస్ మ్యాపింగ్‌ను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.